## క్లుప్తంగా

### నేడు విద్యుత్ అంతరాయం

నగరి : పట్టణ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరాను శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మోహన్‌రావ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

**పుత్తూరులో..**

పుత్తూరు పట్టణంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో రెండవ శనివారం నిర్వహించే నెలసరి మరమ్మతుల నిర్వహణ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రవిచంద్రన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

### వేగంగా మునేశ్వర ఆలయ నిర్మాణ పనులు


నిర్మాణ పనులకు ఆలయం వద్ద చేరిన సామగ్రి

నగరి : పట్టణ పరిధి బస్టాండు ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న మునేశ్వర ఆలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మునేశ్వర రూపమైన రావి చెట్టు చుట్టూ వేసిన టైల్స్ పగిలిపోవడం, ప్రహరీగోడ పక్కకు వాలిపోవడంతో ఆధునీకరించేందుకు స్థానికంగా కొందరు దాతలు ముందుకు వచ్చారు. దీంతో ఆలయ నవీకరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

### సీసీ రోడ్డు వేయండి



విజయపురం : మండలంలోని మల్లారెడ్డికండ్రిగ ఆదిఆంధ్రవాడలో సిమెంట్ రోడ్డు వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మల్లారెడ్డికండ్రిగ నుంచి ఆదిఆంధ్రవాడకు వెళ్లే రోడ్డు చిన్న పాటి వర్షానికే బురదమయంగా మారిపోతోంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా ద్విచక్ర వాహనదారులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు రోజూ నానా అవస్థలు పడుతున్నారన్నారు.

### వైభవంగా కుంభాభిషేకం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీరంగరాజపురం : మండలంలోని తయ్యూరులో ఉన్న శ్రీకృష్ణ ఆలయ మహా కుంభాభిషేకాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. బెంగళూరులో స్థిర పడిన స్థానిక యువకుడు పట్టువస్త్రాలు సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ స్వామివారిని గర్భగుడిలో ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం కనుల పండువగా స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

### పట్టు పరుగుల పెంపకంపై అవగాహన


మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

వెదురుకుప్పం : మండలంలోని పెరుమాళ్లపల్లె రైతు సేవా కేంద్రంలో శుక్రవారం పట్టుపురుగుల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్త కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టుపరుగుల పెంపకానికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తున్నట్లు చెప్పారు. పట్టు పురుగు పెంపకంలో మెలకువలు పాటించి అధిక ఆదాయం పొందాలని రైతులకు సూచించారు. అనంతరం రైతులకు శిక్షణ ఇచ్చారు. పట్టు పురుగుల పెంపకానికి ప్రభుత్వం అందించే రాయితీలను వివరించారు. కార్యక్రమంలో సెరి కల్చర్ అధికారి శోభారాణి, ఏడీ మోహన్, ఎంపీటీసీ సభ్యుడు హరి పాల్గొన్నారు.

### పరిసరాల శుభ్రత తప్పనిసరి


పారిశుధ్య పనుల్లో పంచాయతీ సిబ్బంది

పాలసముద్రం : ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తప్పనిసరిగా చూసుకోవాలని మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి సుధ సూచించారు. శుక్రవారం వెంగళరాజుకుప్పం సర్పంచ్ లిల్లీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇంటి పరిసరాలలో నీరు నిల్వ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.


సాగులో ఉన్న వెల్వెట్ పూలతోట


కొత్తరకం మ్యారీగోల్డ్ పూలతోట


సాగులో ఉన్న గులాబీ రంగు చామంతి

# సిరులు కురిపిస్తున్న విరులు

పాలసముద్రం మండలం చెరుముంద్రకండ్రిగకు చెందిన రైతులు వినూత్నంగా ఆలోచించారు.. సంప్రదాయ పంటలను పక్కన పెట్టారు.. పూల సాగుపై దృష్టి పెట్టారు.. మార్కెట్‌లో డిమాండ్‌ను అందిపుచ్చుకున్నారు.. అవసరాలకు తగ్గట్టు విభిన్న రకాలను ఉత్పత్తి చేశారు. పువ్వుల సరఫరాలో పేరు పొందారు.. చివరకు ఆర్థికాభివృద్ధి సాధించారు.. అప్పుల ఊబి నుంచి బయటపడ్డారు.. ఆదాయం మార్గంలో పయనిస్తున్నారు.

- పూల సాగులో చెరుముంద్ర కండ్రిగ రైతులు
- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న 200 కుటుంబాలు


రైతు సాగు చేసిన బంతి పూలతోట

పాలసముద్రం : చెరుముంద్రకండ్రిగ గ్రామంలో సుమారు 200 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయమే ఆధారంగా బతుకు బండి నడిపిస్తున్నారు. గతంలో ఇక్కడి రైతులు వరి, చెరకు పంటలు సాగు చేసి నష్టపోయి అప్పుల పాలయ్యారు. అయితే గత రెండేళ్లుగా పూల సాగు చేపట్టారు. తొలుత బంతి, నాటు చామంతి, మల్లెలు, కనకాంబరం సాగు చేసేవారు. ఇప్పుడు హైబ్రీడ్ వెల్‌వెట్, హైబ్రీడ్ చామంతి, పసుపు గులాబీ, తెల్ల గులాబీ వంటి రకాలను అధికంగా సాగు చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, తద్వారా ఆదాయం వస్తుండడంతో ఆర్థికంగా బలపడుతున్నారు. ఉదయం తోటలోని పూలను కూలీలతో కోయించుకుని తమిళనాడులోని తిర్తుతణి, వేలూరు, చెన్నై మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు. పూలకు మంచి గిరాకీ ఉన్నప్పుడు వ్యాపారులే తోట వద్దకు వచ్చి ముందస్తుగా అడ్వాన్సు సైతం ఇచ్చిపోతున్నారు. ఇక మండల పరిధిలో శుభకార్యాలయాలకు కూడా ఇక్కడి నుంచే పూలను తీసుకెళుతుంటారు.

**డిమాండ్ ఉన్న రకాలనే..**

మార్కెట్లో మంచి గిరాకీ ఉన్న పూల రకాలనే రైతులు ఎంపిక చేసుకుని సాగు చేస్తున్నారు. హైబ్రీడ్ చామంతి, వెల్‌వెట్ సాగు చేయాలంటే ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చు అవుతుంది. మ్యారీ గోల్డ్, మ్యారీ పింక్ సాగుకు ఎకరానికి రూ.90 వేల నుంచి లక్ష వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ఎకరాకు 10 నుంచి 12 వేలు మొక్కలు నాటాల్సి ఉంటుంది. నర్సరీల్లో 10 వేల మొక్కల ధర రూ.25 వేల నుంచి రూ.29 వేల వరకు ఉంది. ఎరువులు, దుక్కులు, కూలీలు, మందుల ఖర్చులు కలుపుకుంటే గరిష్ఠంగా రూ.50 వేలు నుంచి రూ.90 వేలు వరకు పెట్టుబడి అవుతుంది. మంచి దిగుబడి వస్తే ఎకరానికి 5 టన్నుల పూలు వస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో హైబ్రీడ్ చామంతి, గులాబీరంగు పూల ధరలు కిలో రూ.50 నుంచి రూ.70 వరకు పలుకుతోంది. ఈ మేరకు ఎకరాకు సుమారు రూ.2.5 లక్షల నుంచి రూ.3.5లక్షల వరకు వస్తుంది. మల్లి, కాగడ పూలు కిలో రూ.50 నుంచి రూ.60 వరకు ఉంది, కనకాంబరం కిలో రూ.150 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. త్వరలో ఆడి నెల, దీపావళి, కార్తీక మాసం రానుండడంతో పూల ధరలు మరింత పెరిగే అవకాశముంది.

**ఇతర ప్రాంతాలకు ఎగుమతి**

చెరుముంద్ర కండ్రిగ రైతులు సాగు చేసిన పూలను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. పండుగ సీజన్‌లో అక్కడి వ్యాపారులే ఇక్కడికి వస్తున్నారు. తోటల వద్దనే కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు. ధరలు ఆశాజనకంగా ఉండడంతో మరిన్ని కొత్తరకం పూలను సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

**రోజూ రూ.వెయ్యి మిగులుతోంది**



ఎకరాలో మల్లెతోట పెంచుతున్నా. సాగుకు ఖర్చు రూ.50 వేలు అయ్యింది. రూ.1.5లక్షల వరకు ఆదాయం వస్తోంది. ప్రతి రోజూ పూలను కోసుకెళ్లి తిరుత్తణి, చెన్నై మార్కెట్‌కు చేరుస్తున్నా. కిలో మల్లి రూ.65 నుంచి రూ.75 వరకు ధర పలుకుతోంది. నేను రోజూ సుమారు 25 కిలోల పూలను విక్రయిస్తుంటా. కూలి, ఇతర ఖర్చులు పోను రోజూ రూ.వెయ్యి వరకు మిగులుతోంది.

– వడివేలురెడ్డి, చెరుముంద్ర కండ్రిగ

**తోట వద్దనే అమ్మకం**



గతంలో వరి, చెరుకు సాగు చేశా. లాభాల సంగతి దేముడెరుగు పెట్టుబడి కూడా రాలేదు. దీంతో పూలసాగు చేపట్టా. కొత్త రకం పూలను పండిస్తే వ్యాపారులే మా ఊరికి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. తోట వద్దనే అమ్మకాలు అయిపోతున్నాయి. ఆదాయం బాగానే వస్తోంది. మా గ్రామంలోని రైతులందరూ పూల సాగుపైనా ఆధారపడి ఉన్నాం.

– ముత్యాలరెడ్డి, చెరుముంద్ర కండ్రిగ

**అవగాహన కల్పిస్తున్నాం**



మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రైతులకు పూల తోటల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. అయితే చెరుముంద్రకడ్రిగ రైతులు పూల సాగులో ముందున్నారు. విభిన్న రకాలను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడి రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. వీరు పండించే పూలకు చక్కటి మార్కెట్‌తోపాటు మంచి డిమాండ్ కూడా ఉంది.

– ఢిల్లీప్రసాద్, మండల వ్యవసాయాధికారి

### డయేరియా నిర్మూలనపై అవగాహన

నింద్ర: వర్షాల కారణంగా ప్రజలు అతిసారతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో భవాని అన్నారు. మండల కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులు ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయాలని అన్నారు. ట్యాంక్‌లో నీటిని నింపిన ప్రతి సారీ క్లోరినేషన్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో పరిసరాల శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### వాహనదారులు జాగ్రత్తలు తీసుకోండి


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

నింద్ర: ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని నింద్ర ఎస్‌ఐ రామచంద్ర అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన పలు వాహనదారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రమాదాలకు గురి కాకుండా చూడాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ఉంచుకోవడం, వాహనాలు వేగంగా నడపడం, ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయడం వంటివి చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీకి తిరుమళరాజుపురం విద్యార్థి


పువి కుమార్

పాలసముద్రం : మండలంలోని తిరుమళరాజుపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పువి కుమార్ వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల్లో పువికుమార్ 572 మార్కులు సాధించినట్లు వెల్లడించారు.

# ప్లాస్టిక్ సంచులతో ప్రమాదం



ప్లాస్టిక్ రహిత దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

పుత్తూరు : ప్లాస్టిక్ సంచులను మితిమీరి వాడితే చాలా ప్రమాదకరమని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వీరయ్య తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, పలచగా ఉండే ప్లాస్టిక్ సాధారణ ప్లాస్టిక్ కంటే ప్రమాదకరమని, ఈ సంచులు భూమిలో కలిసిపోకుండా భూసారాన్ని నాశనం చేస్తాయన్నారు. ప్రతి ఏడాది పశువులు, పక్షులు, సముద్రజీవులు ప్లాస్టిక్ సంచుల వల్ల చనిపోతున్నాయని అన్నారు. సమావేశానంతరం ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి పుత్తూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసులు, డాక్టర్ వి.వాసవి, డాక్టర్ జి.గంగయ్య, డాక్టర్ జి.తిరుమలయ్య, డాక్టర్ సురేష్‌బాబు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

# అతిసారం.. అప్రమత్తత అవసరం




సి.కండ్రిగలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది, నీటి తొట్టెను డ్రై చేయిస్తున్న వైద్య సిబ్బంది

- ముందస్తు జాగ్రత్తలతో మహమ్మారి దూరం
- ముమ్మరంగా స్టాప్ డయేరియా కార్యక్రమం

కార్వేటినగరం : అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని, అప్పుడే నివారణ సాధ్యమని వైద్యులు సూచిస్తున్నారు. కలుషిత నీటిని సేవించడం, అపరిశుభ్ర ఆహారాన్ని భుజించడం ద్వారా అతిసార (డయేరియా) వ్యాధి బారిన పడతారని హెచ్చరిస్తున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంటుందని వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం అతిసార బాధితుల సంఖ్యల పెరుగుతున్న నేపథ్యంలోనే ఈ మహమ్మారికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఈ నెల 1 నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు డయేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తోందని వివరిస్తున్నారు. స్టాప డయేరియా కింద వైద్య ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలియజేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున ప్రతి ఒక్కరూ ఆరోగ్య రక్షణకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.


**జాగ్రత్తలు తప్పనిసరి**

నీళ్ల విరేచనాలు అవుతుందంటే డయేరియా అని అనుమానించాలి. ఈ వ్యాధి కారణంగా నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు తగ్గిపోయి కాళ్లనొప్పు వస్తాయి. మనం తాగే నీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్‌కు గురవుతారు. చివరకు ప్రాణాపాయం సైతం కలిగే అవకాశముంది. అందుకే డయేరియా బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. సాధ్యమైనంత వరకూ వేడి పదార్థాలనే తినాలి. మాంసాహారం, ఫ్రిజ్‌లో నిల్వ చేసిన వాటిని తీసుకోకూడదు. ప్రధానంగా చిన్నారులు, వృద్ధుల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి.

**ప్రత్యేక క్యాంపులు**

స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది రెండు నెలల పాటు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి డయేరియా బాధితులను గుర్తిస్తున్నారు. దీంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వెళ్లి విరేచనాలతో బాధపడుతున్న చిన్నారుల ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ ఈ సర్వేలో పాల్గొంటున్నారు.

**కలుషిత నీటితోనే ప్రమాదం**



కలుషిత నీటితోనే అతిసారం సోకుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ కాచిన చల్లార్చిన నీటినే తాగడం మంచిది. ఎవరైనా డయేరియా బారిన పడితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్థానిక పీహెచ్‌సీకి వెళ్లి వైద్యులను సంప్రదించాలి. చికిత్సలు పొందాలి.

– భువనేశ్వరి, కత్తెరపల్లె పీహెచ్‌సీ వైద్యులు, కార్వేటినగరం మండలం

### 19 నుంచి ఉత్సవాలు

వెదురుకుప్పం : మండలంలోని పచ్చికాపల్లంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో ఈనెల 19వ తేదీ నుంచి మహా భారత ఉత్సవాలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ మేరకు నిర్వాహకులు మాట్లాడుతూ 10 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 19న ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు ప్రతి రోజూ మధ్యాహ్నం హరికథా కాలక్షేపం, రాత్రి శ్రీవేంకటేశ్వరా కళా నాట్యమండలి ఆధ్వర్యంలో వీధి నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. 20న పాండవ జననం, 21న బండి కుంభాలు, 22న కలశ పూజ, ద్రౌపదీ దేవి కల్యాణం, 23న ద్రౌపదీ మానసంరక్షణ, 24న అర్జున తపస్మాన్, 25న కీచకవధ, 26న ఉత్తరగోగ్రహణం, 27న ఇలావంతుని వధ, 28న దుర్యోధన వధ, పట్టాభిషేకం, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

### గర్భకోశ వ్యాధిపై అవగాహన


మాట్లాడుతున్న ఏడీ రూపసుందరి

శ్రీరంగరాజపురం : పాడి పశువులకు వచ్చే గర్భకోశ వ్యాధిపై పశసంవర్ధకశాఖ ఏడీ రూపసుందరి అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని వీవీ పురం పంచాయతీ పేద్దకొండేపల్లెలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ గర్భకోశ వ్యాధి బారిన పడ్డ పశువులను వెంటనే వెటర్నరీ ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పాడిరైతులకు రూ.20 వేల విలువైన మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి శ్రీవిద్య, ఎల్‌ఎస్‌ఏ నీలవతి, వెటర్నరీ అసిస్టెంట్ హరిబాబు, నిరంజన్, ఉమ, రామ్మూర్తి, పవన్ పాల్గొన్నారు.

### 16న నగరిలో జాబ్‌మేళా

నగరి : నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎంఆర్‌ఎఫ్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ మంగళవారం ఎంఆర్‌ఎఫ్ ట్రైనీ ఉద్యోగాల కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ బి.సుబ్రమణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు 2019 నుంచి 2024 లోపు డిగ్రీ పూర్తి చేసి 20 నుంచి 26 ఏళ్ల వరకు వయసున్న వారు అర్హులన్నారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా ఫామ్, పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు మార్కుల జాబితా నకలు, డిగ్రీ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ నకలు, వెరిఫికేషన్ కొరకు ఒరిజినల్ ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో పాటు హాజరు కావాలని చెప్పారు. ఈ ఉద్యోగాలను రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. జీతం మొదటి ఏడాది రూ.19,500, రెండవ ఏడాది రూ. 20,500, మూడవ ఏడాది రూ. 21,500 ఇస్తారన్నారు. శిక్షణ పూర్తయిన వారికి మొదటి ఏడాది రూ.10,000, రెండవ ఏడాది రూ.20,000, మూడవ ఏడాది రూ.30,000 అదనంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఎంఆర్‌ఎఫ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌ఎస్ కన్నన్ – 99529 70545 జేకేసీ ఫుల్ టైం మెంటార్ ఆర్.లాల్ బాషా – 9573104593 ను సంప్రదించాలన్నారు.

# ఘనంగా గంగమ్మ జాతర


పొంగళ్లు తీసుకెళుతున్న భక్తులు

శ్రీరంగరాజపురం : మండలంలోని పెద్దతయ్యూరులో ఘనంగా శ్రీపాపరమ్మతల్లి గంగమ్మ జాతర నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి తొలి పూజలో పాల్గొన్నారు. అమ్మవారికి అంబలి, పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. పలువురు భక్తులు వేషాలు ధరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలోనే డప్పు వాయిద్యాల నడుమ గంగమ్మతల్లిని నడివీధిలో కొలువుదీర్చారు. ఆలయ ఆవరణలో మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి ప్రసాదం సమర్పించారు. వంశపారంపర్య ధర్మకర్త గురుస్వామి చెంగల్రాయులు, మణి, కుమార్, లవకుమార్, వెంకటేష్, నటరాజ్ పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి రంగయ్య, చార్లీస్, మోహన్, నాగేష్, మురళి, రాజేష్, బుజ్జి, వడివేలు, హేమాద్రి, సతీష్, చిన్నబ్బ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

# ఆటో స్టాండ్‌ను మార్చవద్దు!



ర్యాలీ చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

పుత్తూరు: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఉన్న షేర్ ఆటోస్టాండ్‌ను యథావిధిగా కొనసాగించాలని ఆ సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక మార్కెట్ యార్డ్ వద్ద శుక్రవారం జరిగిన షేర్ ఆటోవర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. యూనియన్ సభ్యులతో కలిసి నాయకుడు కె.మురగారెడ్డి మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఉన్న ఆటో స్టాండ్‌ను నేడు అన్నా క్యాంటీన్ ఏర్పాటు కోసం ఖాళీ చేయమనడం సమంజసం కాదన్నారు. స్థానిక ఎంజీఆర్ విగ్రహం వద్ద అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసుకోవడానికి అనువైన స్థలమని సూచించారు. అక్కడ అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి తమ షేర్ ఆటో యూనియన్ తరఫున రూ.50 వేలు విరాళం సైతం అందజేస్తామని ప్రకటించారు. అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా తమ జీవితాలకు ఆధారమైన స్థలాన్ని ఖాళీ చేయించాలనుకొనే అధికారులు, అధికార పార్టీ నాయకులు మా వినతిని పరిగణనలోకి తీసుకొని సాయం చేయాలని కోరారు. అనంతరం యూనియన్ నాయకులు ర్యాలీ నిర్వహించారు.

# ధర్మరాజస్వామి ఉత్సవాలకు శ్రీకారం


ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేద పండితులు


విహరిస్తున్న ద్రౌపదీ ధర్మరాజ స్వామివారు

కార్వేటినగరం : మండల కేంద్రంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్ఛారణ నడుమ ధ్వజారోహణం జరిపించారు. ధ్వజపటాన్ని ఎగురవేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో భాగవతారిణి రెడ్డెమ్మ ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం నిర్వహించారు. రాత్రి ప్రత్యేక వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కొలువుదీర్చి గ్రామోత్సవం చేశారు. ఇంటింటా భక్తులు కర్పూరహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలకు యాదవ కులస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యక్షుడు శివ ప్రకాష్, కోశాధికారి బాబురెడ్డి, ఉపకోశాధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.